ప్రజాశక్తి

మంగళవారం 21 జనవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆశ్రయం కరువు

◆ నిరాశ్రయులకు నగరంలో కేవలం 8 నైట్ షెల్టర్లే..! ◆ నిర్వహణ పట్ల జివిఎంసి నిర్లక్ష్యం



భీమ్ నగర్ కల్యాణ మండపంలో నడుస్తున్న నైట్ షెల్టర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో దిక్కులేని దీనులు, హీనులకు ఆశ్రయం కల్పించాల్సిన నైట్ షెల్టర్లు అతి తక్కువ ఉండటం, వాటిలో కూడా సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిరాశ్రయులకు ఆశ్రయం లేని పరిస్థితి నెలకొంది. నగర పరిధిలో ప్రస్తుతం ఎనిమిది నైట్ షెల్టర్లు ఉండగా, వీటిని పెంచుతామని నాలుగేళ్ల క్రితం జివిఎంసి ప్రకటించింది. అయితే ఇంత వరకూ అది అమలుకు నోచుకోలేదు. 2017లో జివిఎంసి నిర్వహించిన సర్వేలో 1224 మంది నిరాశ్రయులు నగరంలో ఉన్నట్లు గుర్తించారు. సర్వే నిర్వహించేనాటికే నగరంలో ఎనిమిది నైట్ షెల్టర్లు ఉన్నాయి. ఆ తర్వాత నుంచి నేటి వరకూ సర్వే జరగలేదు. నైట్ షెల్టర్లు ఏర్పాటు చేసిన ప్రారంభంలో ఉన్న జనాభా కంటే ఇప్పుడు జనాభా ఎన్నో రెట్లు పెరిగింది. 2017లో నగర జనాభా 20 లక్షలు ఉండగా, ఇప్పుడు సుమారు 25 లక్షల మందికి చేరుతుందని అంచనా. అదే క్రమంలో నిరాశ్రయులూ పెరిగారు. వారితో పాటు ఆసుపత్రి అవసరాల కోసం నగరానికి వచ్చే వారి కోసం నీడను ఇచ్చే నైట్ షెల్టర్లు తక్కువగా ఉండటం, వాటిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉన్న వాటిలో ఎక్కువగా నగరానికి దూరంగా ఉండటం తదితర కారణాలరీత్యా వాటిలోకి వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. అంతేగాక అవి ఎక్కడ ఉన్నాయో కూడా చాలా మందికి తెలియని పరిస్థితి.

నిబంధనలు - వాస్తవాలు

షెల్టర్లు ఏర్పడిన సందర్భంలో వాటిలో తగినన్ని పడకలు, తాగునీరు, కాలకృత్యాలు మిగతా 2లో..



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, ఎయు విద్యార్థులు

మెస్ ఛార్జీల భారంపై..

ఎయు విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల కాలంలో పెంచిన మెస్ ఛార్జీలను తగ్గించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. వారినుద్దేశించి సంఘం ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ విచ్చలవిడిగా మెస్ ఛార్జీలు పెరగడంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్లను అభివృద్ధి చేయకుండా హాస్టల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో ప్రతి ఆరు నెలలకు రూ.750, టర్మ్ ఛార్జెస్ పేరుతో రూ.400 వసూలు చేస్తున్నారని, విద్యార్థులపై కరెంట్ బిల్లుల భారం మోపుతున్నారని తెలిపారు. హాస్టల్ రూమ్‌లో ఒక ఫ్యాన్, ఒక లైటుకు రూ.350 కరెంటు బిల్లు వసూలు చేస్తున్నారన్నారు. సమస్యలపై ఇప్పటికే నాలుగుసార్లు వినతులు సమర్పించినప్పటికీ ఎయు అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇతర విశ్వ విద్యాలయాలలో గరిష్టంగా మెస్ ఛార్జీలు రూ.3 వేలు వసూలు మిగతా 2లో..

జివిఎంసి కమిషనర్ బదిలీ

▶ వార్త 8లో..

హెచ్ఆర్ పాలసీ అమలుకు పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా

▶ వార్త 5లో..

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

▶ వార్త 2లో..



అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట వినూత్నరీతిలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

మా గ్రామాలకు రోడ్లు వేయరూ..

డోలీలు కట్టి, అడ్డాకుల టోపీలు పెట్టి గిరిజనుల నిరసన వార్త మెయిన్‌లో..

అర్జీలపై అధికారులదే బాధ్యత

◆ పునరావృతం కాకుండా చూడండి

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్

◆ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ



అర్జీదారు సమస్యను తెలుసుకుంటున్న విశాఖ కలెక్టర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి విలేకరులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తికరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్లలో జరిగింది. విశాఖలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ ఎస్-ఎస్.వర్మ కూడా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలన్నారు. దీంతో అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌నకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. జిల్లాలో అధికంగా 165 రీ ఓపెన్ అర్జీలు రావడం పట్ల అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి కచ్చితమైన సమాచారాన్ని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆశ్రయం కరువు

తీర్చుకునేందుకు, స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు ఉండాలన్న నిబంధన ఉంది. వీటితోపాటు లాకర్ల సదుపాయం ఉండాలి. అయితే ఈ నిబంధనలను ప్రస్తుతమున్న నైట్ షెల్టర్లు పూర్తిస్థాయిలో పాటించటం లేదు. దీంతో నిరాశ్రయులు వీటిలో ఉండేందుకు ఇష్టపడటం లేదు. ఎముకలు కొరికే చలిలో నిత్యం అనేకమంది నిరాశ్రయులు నగరంలో ప్రస్తుతం అనేక చోట్ల కనిపిస్తున్నారు. చలిలోనే కాలం గడుపుతున్నారు. కొన్నేళ్ల క్రితం కేంద్ర బృందం నగరానికి వచ్చి, నైట్ షెల్టర్ల దుస్థితిని, నిరాశ్రయుల అవస్థలను గుర్తించి, మరోసారి నగరంలో నిరాశ్రయులపై సర్వే నిర్వహించాలని, నివేదిక పంపాలని ఆదేశించింది. జివిఎంసి అధికారులు ఆ ఆదేశాలను పెడచెవిన పెట్టారన్న విమర్శలు ఉన్నాయి.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి లక్ష మంది జనాభాకు ఒక నిరాశ్రయుల కేంద్రం (నైట్ షెల్టర్) ఉండాలి. ప్రస్తుతం నగర జనాభా 25 లక్షల వరకు ఉన్నందున 25 నైట్ షెల్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎప్పటి నుంచో ఉన్న 8 షెల్టర్లనే కొనసాగిస్తున్నారు. అదనంగా 17 షెల్టర్లు ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం నడుస్తున్న వాటిలో టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో మహిళలు, పురుషులకు కలిపి ఒక నైట్ షెల్టర్ ఉంది. భీమ్‌నగర్‌లో పురుషులకు ఒక షెల్టర్ ఉంది. ఈ రెండు షెల్టర్లను ఎయుటిడి స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది. పెదవాల్తేరు, మహారాణి పేటలో రెండు షెల్టర్లు ఉండగా, వీటిని రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తోంది. భూపేష్ నగర్‌లో ఒక షెల్టర్ ఉండగా దానిని సమిష్టి సంస్థ నిర్వహిస్తోంది. బుచ్చిరాజుపాలెంలో ఒక కేంద్రాన్ని విస్నా స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తుండగా, ఆరిలోవలో మరొక కేంద్రాన్ని ఎఎంఎస్ఎస్ సంస్థ చేపడుతోంది. టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో నడుస్తున్న నైట్ షెల్టర్‌లో నీటి సమస్య, భీమ్ నగర్‌లో నడుస్తున్న షెల్టర్‌లో మరుగుదొడ్ల సమస్య ఉంది.

కల్యాణ మండపంలో భీమ్ నగర్ షెల్టర్

భీమ్ నగర్‌లోని నైట్ షెల్టర్ జివిఎంసికి చెందిన కల్యాణ మండపంలో కొన్నాళ్లుగా నడుస్తోంది. ఇక్కడ నుంచి నైట్ షెల్టర్‌ను తొలగించి స్థానిక పేద, మధ్య తరగతి ప్రజల వివాహాది శుభకార్యాలకు ఈ భవనం ఉపయోగపడే విధంగా చూడాలని భీమ్ నగర్ ప్రజలు కోరుతున్నారు. ఈ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఇదే సమస్యను జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో స్థానికులు ప్రత్యేకంగా నైట్ షెల్టర్ గురించి ఆయనకు ఫిర్యాదు చేశారు. నైట్ షెల్టర్ తొలగించి భవనాన్ని కల్యాణ మండపంగా ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. అందుకు ఆయన హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదని స్థానికులు అంటున్నారు.

కొద్ది రోజుల క్రితం జివిఎంసి కమిషనర్ నైట్ షెల్టర్లను స్వయంగా వెళ్లి పరిశీలించారు. లోపాలు గుర్తించారు. సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. నెలలు గడుస్తున్నా, ఆయన చేసిన ప్రకటన అమలులోకి రాలేదు. ఇప్పటికైనా నైట్ షెల్టర్ల నిర్వహణ పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, అదనపు నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు జివిఎంసి తక్షణం తగు చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కోరారు. ప్రజా ప్రతినిధులు కూడా వీటిపై దృష్టి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎయు విద్యార్థుల ఆందోళన

చేస్తుంటే, ఎయులో రూ.3900 - రూ.4200 వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. తరగతులు ప్రారంభమైనా మెస్‌లను పూర్తిస్థాయిలో తెరవకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లి తినాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.అజయ్, పి.సాయి పాల్గొన్నారు

కమిటీ ఏర్పాటు

విద్యార్థుల ఆందోళనపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు స్పందించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం సాయంత్రం 9 మందితో కూడిన కమిటీని ఆయన ఏర్పాటు చేశారు.



వార్డు సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ సంపత్ కుమార్

33వ వార్డులో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మంచినీటి పైపులైన్లు డ్రెయినేజీలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నాలుగో జోన్ 33వ వార్డు పరిధిలోని నీలమ్మ వేపచెట్టు, వెంకటేశ్వర మెట్ట, గోవింద రోడ్డు, కుమ్మర వీధి, టర్నర్ చౌల్ట్రీ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలువలలో వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. గోవింద రోడ్డు ప్రాంతంలో తాగునీటి పైప్ లైన్ లీక్‌లను గుర్తించి పై అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై వార్డు ఎమినిటీ కార్యదర్శిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం టర్నర్ చౌల్ట్రీ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి రోజులో ఎంతమంది అన్నా క్యాంటీన్‌ను వినియోగించుకుంటున్నారని ఆరా తీశారు.

అర్జీలపై అధికారులదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి..) అందించి, ఎటువంటి పొరపాట్లకూ తావులేని విధంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పర్యటనను, ఈనెల 18, 19 తేదీలలో సౌత్ జోన్-2 జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌లను నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు.

అనకాపల్లిలో..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వైఎస్‌వికెజిఎస్ఎల్. సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని గ్రామస్థాయిలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

జివిఎంసికి 92 వినతులు

ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 92 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు.

విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్‌కు 21 అర్జీలు

విఎంఆర్‌డిఎలో ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 21 మంది అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కారయోగంగా ఉండాలని, అప్పుడే సంస్థపై ఉన్న నమ్మకం మరింతగా పెరుగుతుందని అన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ ఆర్జీదారు అధికారుల వల్ల పలుమార్లు సంస్థ చుట్టూ తిరగరాదన్నారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వహించరాదన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, అది మాత్రమే శాశ్వత పరిష్కారమని విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు సోమవారమూ కొనసాగాయి. దీక్షల్లో వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం హర్షించదగిన విషయమన్నారు. అయితే ఆ ప్యాకేజీతోనే సమస్య పరిష్కారం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ఉద్యోగులకు బకాయి ఉన్న జీతాలను చెల్లించాలన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. దీక్షల్లో విశాఖ ఆటో రిక్షా యూనియన్ అక్కయ్యపాలెం జోన్ అధ్యక్షులు బాబ్జి, సురేష్, కామేష్, ఎఎస్ఆర్.నగర్‌కు చెందిన పి.గౌరీష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం.అప్పారావు, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ పనిచేస్తున్నాయని తెలిపారు. విశాఖ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో సోమవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టుల ందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అక్రిడిటేషన్ల సదుపాయం కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి.నారాయణ్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు,



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనుబాబు

ఎపి బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కె.మధన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్ మోహన్, కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వై.రామకృష్ణ, టి.కృష్ణమూర్తి నాయుడు, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు కెవి.శర్మ, రవి శంకర్, చక్రి, ఎంవి.రాజశేఖర్, బిఎ.నాయుడు, కె.సత్య నారాయణ, బొబ్బర ప్రసాద్, వై.రాజశేఖర్, శ్రీలత, కిషోర్, జగన్నాథం పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో గీతం వైద్య శిబిరాలు



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న గీతం వైద్యులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన అనకాపల్లి జిల్లాలోని వి.మాడుగుల, చీడికాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, పాడేరు మండలాల్లోని గిరిజన గ్రామాలలో కమ్యూనిటి రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్ఆర్‌సి) లను ఏర్పాటుచేసినట్లు గీతం ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ స్వాతి చిక్కాల తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని వి.మాడుగుల మండలం గడబూరు, రామచంద్రపురం గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. కోవిడ్ అనంతరం ప్రజలలో చైతన్యం తేవడానికి డిఎస్‌టి నిపుణులు డాక్టర్ కొంగర గోపీకృష్ణ పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా సిఆర్ఆర్‌సిలు ఏర్పాటు అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ అభిప్రాయపడ్డారు. గిరిజన గ్రామాలలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం పట్ల అవగాహన కలిగించడంతో పాటు ఉచిత వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో పాటు అరోహన్ ట్రైబల్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్ర, రోటరీ విశాఖ పెరల్ సిటీ సంయుక్తంగా జిమ్‌సర్ ఆసుపత్రి వైద్యులతో కలసి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత మందులు అందించాయి. స్థానిక గిరిజనులకు తాగు నీటిని శుభ్ర పరుచుకునే విధానం, స్థానికంగా లభించే ఉత్పత్తులతో ఉపాధిని పెంచుకొనే పద్ధతులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షించుకొనే పద్ధతులను వివరించారు. గ్రామాలలోని బాలికలకు రుతుస్రావం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పోషకాహర లోపాల వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. వైద్య శిబిరం ఏర్పాటుకు జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి సహకారం అందించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యం



ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6 వార్డు పరిధి బక్కన్నపాలెం సాయి టవర్స్‌కు చెందిన షేక్ చంద్ బాషా ఈ నెల 11 తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి సమీప పరిసరాల్లో, బంధువులు ఇళ్లలో అతని భార్య ఫాతిమా వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చెసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



విద్యుదాఘాతంతో మృతిచెందిన కాంట్రాక్టు కార్మికుడు

విద్యుదాఘాతంతో కాంటాక్ట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఓ ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మహమ్మద్ గౌస్ (43) మృతి చెందాడు. పెదగంట్యాడ మండలం ఇస్లాంపేట ప్రాంతానికి చెందిన మహమ్మద్ గౌస్ ఆర్ఎంహెచ్‌పి డిపార్ట్‌మెంట్ రైల్వే వ్యాగన్ వర్క్ ప్రాంతంలో రిపేర్లకు వెళ్లిన సందర్భంలో విద్యుత్ షాక్‌కు గురై సోమవారం మృతి చెందాడు. తోటి కార్మికులు ఇచ్చిన సమాచారం మేరకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఉక్కునగరం పోలీసులకు సమాచారం అందజేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

పని ప్రదేశంలో మృతి చెందిన కార్మికునికి న్యాయం చేయాలని కార్మిక నేతలు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ రూ.5 లక్షలు నష్టపరిహారం అందజేయడానికి, దహన ఖర్చుల నిమిత్తం వెంటనే రూ.20వేలు అందజేయటానికి అంగీకరించారు. ప్రమాద సమయంలో మృతిచెందితే కార్మికుని కుటుంబానికి అందజేసే రూ.11 లక్షల యాక్సిడెంటు ఇన్స్యూరెన్స్ కుటుంబానికి వర్తిస్తుందని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, మంత్రి రవి, వంశీకృష్ణ యాదవ్, మసేన్ తదితరులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి న్యాయం చేశారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహమూర్తి మృతి



ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి మున్సిపల్ మాజీ చైర్మన్ బొండా నరసింహమూర్తి (68) బ్యాంక్ కాలనీలోని స్వగృహంలో మృతి చెందినట్లు సోమవారం కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇతని మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కష్టంలో ఉన్న వారికి అన్ని విధాలా అండగా ఉండే మనస్తత్వం కలిగిన నరసింహమూర్తి మృతి బాధాకరమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఒక ప్రకటనలో అవేదన వ్యక్తం చేశారు. మృతికి సంతాపం తెలిపారు.

కూలిరేట్లుపై ఒప్పందం

ప్రజాశక్తి -పద్మనాభం : లారీ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల కూలిరేట్లపై ఒప్పందం జరిగి సమస్య పరిష్కారమైనట్లు సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి సోమవారం తెలిపారు. వాహనాల యజమానులకు, కార్మికులకు ఆర్‌కె.బ్రిక్స్ వద్ద సమావేశం ఏర్పాటుచేశారు. సిఐటియు ఆధ్వర్యాన కూలి రేట్లుపై చర్చలు జరిపారు. లారీ లోడ్‌కు రూ.100, వ్యాన్‌కు రూ.50 పెంచాలని కార్మికులు డిమాండ్‌చేశారు. వాహన యజమానులు పెంచలేమని మొండికేశారు. పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ ఈ చర్చల్లో కల్పించుకొని లారీకి రూ.50, వ్యాన్‌కు రూ.25 పెంచాలని నిర్ణయించారు. ఒక ఏడాది పాటు ఇది అమలులో ఉంటుందని చెప్పారు.

7వ వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరుతూ కమిషనర్ సంపత్‌కుమార్‌కు జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ పిళ్లా మంగమ్మ, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి పిళ్ళా వెంకటరావు వినతి పత్రం అందజేశారు. లక్ష్మీదేవి గుడి నుంచి జాతీయ రహదారి వరకు, కృష్ణానగర్ నుంచి జాతీయ రహదారి వరకు, భరత్‌నగర్ నుంచి ఎన్‌జిఒ కాలనీ వరకు, వాంబే కాలనీ శివాలయం నుంచి నగరంపాలెం తుపాన్ బిల్డింగ్ వరకు, చంద్రంపాలెం, దుర్గానగర్ నగరంపాలెం, కాలనగర్ ముత్యాలమ్మ గుడి, మొగదరమ్మ కాలనీ, టైలర్స్ కాలనీ, శ్యామ్‌నగర్, దోబీ కాలనీలో కాలువలు, రోడ్ల మరమ్మత్తులు తదితరాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మధురవాడ ప్రభుత్వ హాస్పిటల్ నుంచి స్వతంత్ర నగర్ పార్కు వరకు ఇరువైపులా కాలువలు, రోడ్ల విస్తరణ, 7వ వార్డులో వీధి దీపాలు, వార్డులో తాగునీటి సమస్య, ఎపి హౌసింగ్ బోర్డులో వాటర్ ట్యాంక్ సంపు, పైప్ లైన్లు మరమ్మతులు, బింద్రానగర్‌లో రాయల్ రెసిడెన్సీ వద్ద రోడ్ల నిర్మాణం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మహిళలకు అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి గ్రామంలో వ్యవసాయ సంబంధిత మహిళలకు సోమవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎపి డైరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అనూష, దాకమర్రి ప్రభుత్వ పశు వైద్య శాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 11మంది సభ్యులతో గ్రూప్‌గా ఏర్పడితే పాడి పరిశ్రమ అభివృద్ధికి, తద్వారా మహిళల స్వయం ఉపాధికి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తుందని వివరించారు. పాడి రైతులకు వివిధ బ్యాంక్‌ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేసి ప్రభుత్వం సహకారం అందిస్తుందని వివరించారు. పశుగ్రాశం తయారీ, పెంపుదలకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు తెలిపారు. పాడి రైతులకు పాలకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్

చిన్న శ్రీనును కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను పలువురు నియోజకవర్గ వైసిపి నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలోని అతని నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. మజ్జి శ్రీనివాసరావును కలిసిన వారిలో ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు, దాకమర్రి ఎంపిటిసి చెల్లూరి నగేష్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, పొట్నూరు చంద్ర శేఖర్ తదితరులున్నారు.



చిన్నశ్రీనును కలిసిన ఆనందపురం మండల వైసిపి నాయకులు

ఆనందపురం : ఆనందపురం మండల నాయకులు కూడా సోమవారం చిన్నశ్రీనును విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆనందపురం మండలంలో వైసిపి చాలా బలంగా ఉందని చిన్నశ్రీనుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, గండ్రేటి శ్రీను, రౌతు వెంకట్రావు, శ్రీను, షినగం చిన్న రామారావు, స్వామి, కోన శ్రీనివాసరావు, అప్పలరాజు పాల్గొన్నారు.



ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. వీరికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను అతిథులుగా పిలిచి సత్కరించారు. దాదాపు 12 సంవత్సరాలు తరువాత కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్రీయ సేవా యోజన ఎన్ఎస్ఎస్‌లో 2019-20 సంవత్సరానికి రాష్ట్రపతి అవార్డు అందుకున్న స్నేహితుడు ధనియాల సాయిని గురువుల సమక్షంలో అందరూ సత్కరించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

ఎన్ఎడి కార్మికులకు సంఘీభావం



బీచ్ ఫొటోగ్రాఫర్లకు సూచనలిస్తున్న సిఐ సుధాకర్

సందర్శకులతో మర్యాదగా ఉండాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : బీచ్‌ను సందర్శించే పర్యాటకులు, సందర్శకుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని బీచ్ ఫొటోగ్రాఫర్లకు సిఐ బి.సుధాకర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీచ్ ఫొటో గ్రాఫర్లకు సోమవారం అవగాహన కల్పించారు. అమర్యాదగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగరతీరంలో అనుమానాస్పదంగా తిరిగే వారిని గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.హరీష్ పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి

కెవిపి చంద్రమౌళి డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న 38 మంది కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, వారిని యథావిధిగా విధుల్లో కొనసాగించాలని సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సెవెన్ హిల్స్ ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పనిచేస్తున్న 38 మంది కార్మికులను తొలగిస్తూ యాజమాన్యం తీసుకున్న చర్యను నిరసిస్తూ విశాఖ హాస్పటల్ నర్సింగ్ హెూమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన చేసి కార్మిక శాఖ అధికారులకు లిఖితపూర్వంగా ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. సెక్షన్ 47 ప్రకారం కార్మికులను తొలగించడం విరుద్ధమని, వారిని కొనసాగించాల్సిందేనని లేబర్ ఆఫీసర్ ఆదేశించారని పేర్కొన్నారు. అప్పటినుంచి కార్మికులు యథావిధిగా విధులు నిర్వహిస్తున్నా వారికి జీతాలు చెల్లించకపోవడం అన్యాయం అన్నారు. వారందరినీ యథావిధిగా కొనసాగించాలని లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. హాస్పిటల్ సూపర్వైజర్లు కార్మికులను తీవ్రస్థాయిలో హింసకు గురి చేస్తున్నారని, దానిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని మంగళవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. కుష్ఠి వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటినీ సందర్శించి అనుమానిత కేసులను గుర్తించి వైద్యాధికారుల వద్దకు పంపించి, తగు చికిత్స అందించాలని చెప్పారు. వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ పూర్ణేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడిలో కార్మికుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన సత్యాగ్రహ దీక్షలకు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ఎన్ఎడిలో సస్పెండ్ అయిన 36 మంది కార్మికులు, నాయకులను తిరిగి డ్యూటీలో చేరేంతవరకు తమ యూనియన్ అండగా ఉంటుందని చెప్పారు. కార్మికుల హక్కుల కోసం నిలబడిన నాయకులపై ప్రతి యాజమాన్యమూ కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. అయినా అంతిమ విజయం కార్మికులదే అవుతుందని స్పష్టంచేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వైటి.దాసు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం సమాజంలోని అన్ని రంగాలపై దాడి చేస్తుందన్నారు. ఆధునిక దేవాలయాలగా కీర్తింపబడిన పబ్లిక్ రంగ సంస్థలను, చివరికి రక్షణ రంగాన్ని సైతం కార్పొరేట్ గుత్త పెట్టుబడిదారి సంస్థలకు దారాదత్తం చేస్తుందని విమర్శించారు. అంబేద్కర్ ప్రసాదించిన ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకొని మన తరపున నిలబడే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ, కార్మికుల సస్పెన్షన్లు ఎత్తివేయుటకు యాజమాన్యం తగిన చర్యలు చేపట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమలో నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎడి కార్మికులకు సంఘీభావంగా మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి

జయగోపాల్‌కు పెరియార్ అవార్డు అందజేత

ప్రజాశక్తి-సీతమ్మధార : అంతర్జాతీయ హక్కుల నాయకులు, భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్‌కు ఆయన మరణానంతరం చెన్నైలోని ద్రవిడ కజగం, పెరియార్ తమిళ్ ఫోరంచే పెరియార్ అవార్డును ఈ నెల 15న ద్రవిడ కజగం నాయకులు డాక్టర్ కె.వీరమణి అందించినట్లు భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామ్మూర్తి, వై.నూకరాజు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అవార్డు వివరాలను వెల్లడించారు. 1972లో డాక్టర్ జయగోపాల్‌చే స్థాపించబడిన భారత నాస్తిక సమాజం దేశంలోని ఎనిమిది రాష్ట్రాలలో విరివిగా మూఢనమ్మకాల నిర్మూలన, హక్కుల సాధనకు కృషి చేసిందని తెలిపారు. దళితులు, స్త్రీలపై దాడులకు వ్యతిరేకంగా, మానవహక్కుల పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక పెరియార్ అవార్డును అందించారని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా మానవ హక్కులకు కృషిచేసిన డాక్టర్ జయగోపాల్‌కు గతంలో కెనడా సంస్థచే "పెన్ ఆఫ్ బ్రేవ్ మైండ్స్" అవార్డు కూడా వచ్చిందన్నారు.

సిపిఐ నాయకులు మరుపిల్ల పైడిరాజు మాట్లాడుతూ, డాక్టర్ జయగోపాల్‌కు ఈ అవార్డు రావడం సముచితమన్నారు. తమిళనాడులోని పెరియార్ ఈవి రామసామి ఆలోచనలు, ఆయన సిద్ధాంతాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో విరివిగా ప్రజలలోకి తీసుకు వెళ్లడంలో డాక్టర్ జయగోపాల్ ముందు వరుసలో ఉంటారన్నారు. డాక్టర్ జయగోపాల్ ఆధ్వర్యంలోనే ఆర్‌కె.బీచ్ వద్ద పెరియార్ విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సమావేశంలో భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు జె.రవి, జె.శ్యామల, జె.సునీత, రాంప్రభు, విజ్ఞానంద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ

ప్రజాశక్తి- యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇచ్చారు. మెప్మా, హోమ్ ట్రయాంగిల్ సంయుక్తాధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 68 మంది వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లు పాల్గొన్నారు. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, యుసిడి ఎపిడి వికె.దొర పాల్గొని పలు సూచనలు చేశారు.

ములగాడ : జివిఎంసి 60 వార్డు పరిధి గొల్లలపాలెం యుసిడి కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇచ్చి హోమ్ ట్రయాంగిల్ సంస్థ యాప్ ద్వారా ఆన్ బోర్డ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి దశలో పురుషులకు వడ్రంగులు, ప్లంబింగ్, విద్యుత్ సేవలు, ఉపకరణాలు (వీటిలో ఎసి, రిఫ్రిజిరేటర్/వాషింగ్ మెషిన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ ఉంటాయని) తెలిపారు. బ్యూటీషియన్స్ (మహిళలు, పురుషులు) కేటగిరీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సర్వీస్ ప్రొవైడర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ - 5 కమిషనర్ రాము, ఎపిడి కృపానంద, దుర్గాప్రశాంతి, బిజెపి నాయకులు పొలిమేర శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సర్వీసు ప్రొవెడర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

కేర్ ఆసుపత్రిలో రోబోటిక్ ప్రొక్టోకోలెక్టమీ శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న కేర్ ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో రోబొటిక్ ప్రొక్టోకోలెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో యాజమాన్య ప్రతినిధులు శస్త్రచికిత్స గురించి వివరించారు. మూడు సంవత్సరాలుగా దీర్ఘకాలిక మల రక్త స్రావం, రక్తహీనతతో బాధపడుతూ స్టెరాయిడ్స్‌పై ఆధారపడుతున్న 25 ఏళ్ల యువకుడు ఇటీవల కేర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడని తెలిపారు. తీవ్రమైన వ్రణోత్పత్తి, పెద్ద ప్రేగు నొప్పితో బాధపడుతున్న అతన్ని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బిస్వబసు దాస్ పరిశీలించి అవసరమైన పరీక్షలు నిర్వహించారు. పొత్తి కడుపును కోయడం వంటి సంప్రదాయక శస్త్రచికిత్స వలె కాకుండా సంచలనాత్మకమైన రొబొటిక్ ప్రొకోటకోలెక్టమీని విజయంతంగా నిర్వహించారు. కేర్ ఆసుపత్రి సిఒఒ మయూఖ్ చౌదరి మాట్లాడుతూ, సంక్లిష్టమైన శస్త్రచికిత్స సవాళ్లను ఎదుర్కోవడం కేర్ ఆసుపత్రి వైద్య బృందానికి, కీలక పాత్ర వహించిన సర్జన్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఒక వ్యక్తికి పూర్తి స్థాయిలో రోబోటిక్ పోక్టోకోలెక్టమీని విజయంతంగా నిర్వహించడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్సతో కోలుకున్న రోగి ఆనందం వ్యక్తంచేశాడు.

పిజిఆర్ఎస్‌కు వినతులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పలు కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్యలపై వినతులు అందాయి.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 10 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 2, ఇంజినీరింగ్ విభాగానికి -7, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 1 అర్జీ అందినట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్న వాణి తెలిపారు. ఆయా అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగాల అధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు.

సీతమ్మధార : జివిఎంసి జోన్ -3 కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 4 అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాదరావు తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య ప్రేమలత, డిప్యూటీ తహశీల్దార్ త్రినాధరావు, విఆర్ఒలు పాల్గొన్నారు.

హెచ్ఆర్ పాలసీ అమలుకు

పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నాలు

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద లోపలకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు



అనకాపల్లి కలెక్టరేట్ లోపలకు వెళ్తున్న ఉద్యోగులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) ఉద్యోగులకు ఐదేళ్ల కిందట విడుదల చేసిన జిఒ 36 ప్రకారం హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరుతూ ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డగించారు. దీంతో ఉద్యోగులకు పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. వీరికి మద్దతు తెలియజేసిన సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి గంట శ్రీరామ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ద్వారా హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, అందుకు అవసరమైన డిఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేయాలని కోరారు. పిఎసిఎస్ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయో పరిమితి 62 సంవత్సరాలు వర్తింపజేయాలన్నారు. 2019 నుంచి వేతన సవరణ, మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019 మార్చి1 తర్వాత ఉద్యోగంలో చేరిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. గ్రాట్యూటీ రెండు లక్షల పరిమితి కాకుండా చట్ట ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్యూ టు పద్దులు, ఆడిట్ జ్యూయల్ పద్ధతి రద్దు చేయాలని, ఇన్‌కమ్ టాక్స్ పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొడ్డేటి లక్ష్మణరావు, జి.రమణ మాట్లాడుతూ 27న విజయవాడ రాష్ట్ర సహకార బ్యాంకు వద్ద, మహాధర్న చేస్తామని, అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి 10 నుండి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ మాజీ అధ్యక్షులు నాగభూషణం, జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని 2019 మార్చి ఒకటిన విడుదల చేసిన జీవో 36ను ఐదేళ్లగా అమలు చేయకపోవడం శోచనీయమని ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రామకృష్ణ, ఎల్ఎఆర్ ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి టి.సన్యాసిరావు ఆవేదన వెలిబుచ్చారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేయాలని, పదవి విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.



విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు

పరవాడ డిఎస్‌పిగా విష్ణు స్వరూప్



బాధ్యతల స్వీకరిస్తున్న స్వరూప్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ డిఎస్‌పిగా వి విష్ణుస్వరూప్ ఆదివారం ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ డిఎస్‌పిగా పనిచేసిన కెవి.సత్యనారాయణ బదిలీ, రిలీవయ్యారు. కొత్త డిఎస్‌పి విష్ణుస్వరూప్‌ను పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎలమంచిలి సిఐలు, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త డిఎస్‌పి విష్ణుస్వరూప్ మాట్లాడుతూ, ఈప్రాంత పరిస్థితులు, సమస్యలపై అవగాహన చేసుకుని, సిబ్బంది అందరి సహకారంతో నేరాల నియంత్రణకు, ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలను అందించడానికి కృషి చేస్తానన్నారు.

అదనపు ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు : జెసి

ప్రజాశక్తి-అనకాపల్లి : దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద లబ్ధిదారులకు అందిస్తున్న గ్యాస్ సిలెండర్లకు చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిర్దేశించిన ధరల ప్రకారం 15 కిలో మీటర్ల పరిధిలో గ్యాస్ డెలివరీ ఉచితంగాను, 15 కిలోమీటర్ల పరిధి దాటితే రూ.30 మాత్రమే వినియోగదారులు ఛార్జీలు చెల్లించాలని స్పష్టం చేశారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్‌లు డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, లబ్ధిదారులనుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువైతే సదరు గ్యాస్ ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ఫిర్యాదు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పౌర సరఫరాలశాఖ క్షేత్ర సిబ్బందికి ఆదేశించినట్లు చెప్పారు. అదనంగా డబ్బులు వసూలు చేసినచో పౌర సరఫరాల విభాగపు టోల్ ఫ్రీ నెంబర్ 1967కు లేదా ఆయిల్ కంపెనీల ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటరు 1800 2333555 అనే నెంబర్లుకి కాల్ చేసిగాని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలోగాని ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిఎం ఇంటర్న్‌షిప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం ఇంటర్న్ షిప్ పథకం వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. కలెక్టరు కార్యాలయంలో పీఎం ఇంటర్న్ షిప్ పథకం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధ్యమైనంత ఎక్కువ మంది యువత ఈ పథకాన్ని వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఇంటర్న్‌కు 12 మాసాల పాటు శిక్షణ ఇస్తూ, నెలవారీ సహాయం కింద రూ.4,500, పరిశ్రమల ద్వారా రూ.500, సంఘటనల కోసం రూ.6,000 వన్-టైమ్ గ్రాంట్ మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. శిక్షణ కాలంలో పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్ష బీమా యోజన కింద బీమా కవరేజీ వర్తిస్తుందని తెలిపారు. ఇంటర్న్ షిప్ అనంతరం ప్రతిష్టాత్మకమైన కంపెనీలలో ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన 21 నుంచి 24 సంవత్సరాలు వయస్సు కలిగిన అభ్యర్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21లోగా https://pminternship.mca.gov.in/login లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9010793492 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : లెప్రసీ కేస్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. లెప్రసీ కేస్‌ల డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సిడిసి)-2025 ప్రచార పోస్టరును సోమవారం కలెక్టరు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 20 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు 14 రోజులపాటు జరగనున్న ఈ సర్వేలో సిహెచ్వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి, ప్రతి కుటుంబ సభ్యుడిని పరీక్షించాలని సూచించారు. అనుమానిత కేసులను సంబంధిత పిహెచ్‌సిల వైద్యాధికారికి పంపించాలన్నారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : అధిష్టానం ఆదేశాల మేరకు బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైసిపి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పార్టీని సంస్థాగతంగా బలోపేతానికి ఇప్పటికే నియోజకవర్గ సమన్వయకర్తలు పార్లమెంటు పరిశీలకుల నియామకాలు జరిగాయన్నారు. తనను పార్లమెంట్ పరిశీలకునిగా, గుడివాడ అమర్‌నాథ్‌ను చోడవరం నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించారని తెలిపారు. ఈనెల 24న పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలతో అమర్ పరిచయ కార్యక్రమం ఉంటుందని, అలాగే ఈ నెల 31న అనకాపల్లిలో నాయకులు ముఖ్య కార్యకర్తలతో జిల్లాస్థాయి సమావేశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, జెడ్‌పిటిసి మారిశెట్టి విజయ శ్రీకాంత్, వైసిపి యూత్ జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, బొడ్డేటి సూర్యనారాయణ, పళ్ళ నర్సింగరావు, పినబోయిన అప్పారావు యాదవ్, సేనాపతి సత్యారావు, బొగ్గు శ్యామల, ఓరిగంటి నెహ్రూ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తౌఫిక్

- మతి స్థిమితం లేని వ్యక్తిని అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రాంతంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న బిహార్‌కు చెందిన తౌఫిక్ అనే యువకుడ్ని చోడవరం పోలీసులు అతని బంధువులకు అప్పగించారు. చోడవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న యువకుడిని పోలీసులు ప్రశ్నించగా, తాను బిహార్‌కు చెందిన వాడిగా అడ్రస్ చెప్పడంతో, చోడవరం పోలీసులు అతని కుటుంబసభ్యులతో ఫోనులో సంప్రదించి, రప్పించారు. తౌఫిక్‌ను వారికి అప్పగించారు. మతిస్థిమితం లేకుండా తప్పిపోయిన యువకుడిని చొరవతీసుకుని అప్పగించిన చోడవరం పోలీసులను పలువురు ప్రశంసించారు. యువకుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



తౌఫిక్ బంధువులకు అప్పగించిన పోలీసులు

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వయోజన విద్యా వాచకములు, వాలంటరీ మార్గదర్శకాలు పుస్తకాలను జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం ద్వారా గుర్తించబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలన్నారు. జిల్లాలో మొదటి దశలో 11,900 మంది అభ్యాసకులను, 1190 మంది వాలంటీర్లను గుర్తించడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపిడిఒలు, ఎపిఎంలకు రెండుదశల శిక్షణ పూర్తి చేశామని, మండల స్థాయిలో వాలంటరీ టీచర్లకు మొదటి దశ శిక్షణ పూర్తి చేసి, రెండవ దశ ప్రారంభించనున్నట్లు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలలో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వయోజన విద్యాతరగతుల నిర్వహణకు అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, పంచాయితీ కార్యాలయాలు, సామాజిక భవనాలు వినియోగించుకోవచ్చని తెలిపారు. అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు పంపిణీచేసి, వెంటనే తరగతులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, వయోజన విద్యాశాఖ సహాయ సంచాలకులు డి.చిన్నికృష్ణ, డిఆర్డిఎ ప్రోజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఎస్.మంజులవాణి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు ప్యాకేజీతో నయవంచన

ప్రజాశక్తి-దేవరాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు సహాయం అందిస్తున్నట్లు ప్రకటించి కేంద్రం ప్రభుత్వం నయ వంచనకు పాల్పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేకపోతును బలిచ్చే ముందు ముస్తాబు చేసినట్టే.., విశాఖ ఉక్కును కొనుక్కునే ప్రైవేటువారి సౌలభ్యం కోసమే కేంద్రం ఈ ప్యాకేజీని ప్రకటించిందని అర్ధమవుతుందని పేర్కొన్నారు. కేవలం 0.5 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌కు రూ.15వేల కోట్లు సహాయాన్ని అందించి ఎటువంటి షరతులూ విధించని కేంద్ర ప్రభుత్వం.., దానికి పదిహేను రెట్లు పెద్ద అయిన 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న విశాఖ ఉక్కుకు కేవలం రూ.11,440 కోట్లు కేటాయించి సవాలక్ష నిబంధనలు విధించడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలకు, ముడి సరుకులు కొనుగోలుకు ఈ ప్యాకేజీ సొమ్ము వినియోగించరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. కేంద్రం అందిస్తున్న ఈ ప్యాకేజీ వెనుక వున్న మతలబును కూటమి నేతలు దాచిపెట్టి ప్రజలను నిలువునా ముంచేయడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నిలబడాలంటే ప్యాకేజీలు సరిపోవని, ముందు ప్రైవేటీకరణ నిర్ణయం ఆపి, సొంత ఇనుప గనులు, రైల్వే వ్యాగిన్స్ కేటాయించాలని, మూసి వేసిన బ్లాస్ట్ ఫర్నేస్‌ని పున:ప్రారంభించాలని, విశాఖ స్టీల్ అప్పులను మాఫీ చేయాలని, గంగవరం పోర్టులో అదానీ అడ్డంకులు తొలగించాలని డిమాండ్ చేశారు.

'మారిటైం' నిర్వాసితుల వంటావార్పు

మూడో రోజుకు చేరిన వంగలి రైతుల నిరసన దీక్షలు

ప్రజాశక్తి-సబ్బవరం

ఇండియన్ మారిటైం యూనివర్సిటీకి భూసేకరణ సమయంలో నిర్వాసిత రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వంగలి సర్పంచ్ ఆకుల శ్రీహేమ గణేష్ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి మారిటైం వర్సిటీ నిర్వాసిత రైతుల నిరసన దీక్షలు సోమవారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షాశిబిరం వద్ద వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇండియన్ మారిటైం యూనివర్సిటీకి 2010లో 110 ఎకరాల భూములు ఇచ్చామని, భూసేకరణ సమయంలో నిర్వాసిత రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారన్నారు. అలాగే గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని మాటిచ్చారన్నారు. 14ఏళ్ళు గడిచినా నేటికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగాకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును నాలుగుసార్లు, ఎంపీ సీఎం రమేష్‌ను మూడు సార్లు, కలెక్టర్‌ను మూడుసార్లు కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు.. నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు దీక్షలను విరమించబోమని, అవసరమైతే ఆమరణదీక్ష చేస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరాన్ని స్థానిక తహశీల్దార్ బి. చిన్నికృష్ణ, సిఐ పిన్నింటి రమణ సందర్శించి, సమీక్షించారు. కార్యక్రమంలో జెట్టి ప్రసాద్, జెట్టి ముత్యాల నాయుడు, గొర్లి అప్పల నాయుడు, జెట్టి శ్రీను,ముమ్మన అప్పలరాజు, జెట్టి హేమంత్, యర్ర సతీష్,గవర అప్పలనాయుడు, తోట వెంకటేష్, బలిరెడ్డి శివ, సోమేష్,గవర గాయత్రి, కంద లక్ష్మి, కోన నాగమణి, ఎన్ గీత ,ఇల్లపు నాయుడమ్మ పాల్గొన్నారు.



ప్లకార్డులు పట్టుకొని నిరాహార దీక్ష చేస్తున్న నిర్వాసిత రైతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలి

ప్రజాశక్తి-యలమంచిలి : ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే ప్రక్రియ ప్రారంభించాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించారు. స్థానిక తులసీనగర్‌లోని జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలకు సిద్ధంగా ఉన్న విద్యార్థులను పలు రంగాల్లో ప్రశ్నలు వేసి పరీక్షించారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యంపై విద్యాశాఖ దృష్టి సారించిందని తెలిపారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు అసలేష్

ప్రజాశక్తి-సబ్బవరం : జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు తమ పాఠశాల పదో తరగతి విద్యార్థి జి. అసలేష్‌కుమార్ ఎంపికైనట్లు సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. తిరుపతిరావు తెలిపారు. ఈనెల 11,12 తేదీలలో శ్రీకాకుళం జిల్లా పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన 41వ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు తమ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు జి. అసలేష్ కుమార్, బి. గ్రీష్మ, బి. సుమంత హాజరుకాగా, ఆయా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన జి అసలేష్ కుమార్ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈనెల 31 నుండి వచ్చేనెల 4 వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలలో అసలేష్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా అసలేష్‌ను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు పి.రాధాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఎస్ఎంసి చైర్మన్ జి. శంకర్రావు, వైస్ చైర్మన్ జి.జ్యోతి పాల్గొన్నారు.

రామ్‌కో సిమెంట్స్ కాలుష్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎన్.జి.పేటలోని రామ్‌కో సిమెంట్స్ కాలుష్యంపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గొబ్బూరుకు చెందిన బుద్ధ వెంకటరమణ తెలిపారు. రామ్‌కో కంపెనీ నుంచి ధూళితోపాటు దుర్వాసన, ఇతర కాలుష్యంతో పొలాలన్నీ బూడిదమయం కావడంతోపాటు ప్రజారోగ్యం పాడౌతోందని వివరించాడు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు.దీనిపై కాలుష్యనియంత్రణ మండలికి, కశింకోట తహశీల్దార్, గొబ్బూరు కార్యదర్శికి తన ఫిర్యాదును తగు చర్యలకు రిఫర్ చేశారని వెంకటరమణ తెలిపారు

భూముల రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రం బుచ్చయ్యపేటలో భూముల రీ సర్వే పనులను సోమవారం స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వేను చేస్తుందని చెప్పారు. పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డొంకిన అప్పలనాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల : కూటమి ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకున్న చిన్న బొడ్డేపల్లి గ్రామంలో సోమవారం నుంచి రీ సర్వే పనులు ప్రారంభించారు. తహసిల్దార్ తిరుమల బాబు ఇచ్చిన వివరాల ప్రకారం... గ్రామ పరిధిలో 6 గ్రామాల ప్రభుత్వ భూమి 214 ఎకరాలు గుర్తించగా సదరు భూమిని సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులందరికీ నోటీసులు అందజేస్తామని రైతుల సమక్షంలోనే ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. సర్వేలో ఎటువంటి తప్పులు జరగకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు.



రీ సర్వే పనులను ప్రారంభిస్తున్న బుచ్చయ్యపేట సర్పంచ్ లక్ష్మి

తుమ్మపాల సుగర్స్‌లో దొంగతనాలపై విచారణ చేపట్టాలి

జెసికి ఏపీ రైతు సంఘం జిల్లా నేతల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం తుమ్మపాల వివి రమణ సహకార చక్కెర ఫ్యాక్టరీలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు సోమవారం జాయింట్ కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. సుమారు రూ.70 లక్షలు విలువైన యంత్ర సామాగ్రి తుమ్మపాల ఫ్యాక్టరీ నుంచి దొంగలు ఎత్తుకు పోయారని, ఆ దొంగలను తుమ్మపాల రైతులే పట్టుకొని మీడియాకు అప్పగించారని వార్తలు వచ్చాయని తెలిపారు. అయినా ఫ్యాక్టరీ ఎమ్‌డి ఏ రకమైన ప్రకటన చేయలేదని, కనీసం జాయింట్ కలెక్టర్కు కూడా తెలియజేయలేదని మండిపడ్డారు. దీనిపై విచారణ చేసి ఆస్తులు తిరిగి రాబట్టాలని, ముద్దాయిలపై కేసులు పెట్టాలని కోరారు. దీనికి సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి పూర్తి బాధ్యత వహించాలని, లేకపోతే అతనిపై కూడా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

ప్రజాశక్తి-యలమంచిలి : ప్రకృతి వ్యవసాయం ఆధారిత దిగుబడుల స్టాల్‌ను స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ఏర్పాటు చేశారు. వారానికి ఒక రోజు ఇలా ఆఫీసులో ఉద్యోగుల కోసం ఈ స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పోతిరెడ్డిపాలేనికి చెందిన వెంకటలక్ష్మి, వరలక్ష్మి తెలిపారు. పోషక విలువలున్న పాలిష్ చేయని బియ్యం, హైడ్రాక్సైడ్‌లాంటి కెమికల్స్ కలవని బెల్లం, పురుగు మందులు, రసాయనాలు వాడని ఉత్పత్తులు ముల్లంగి, పాలకూర, టమేటో, బొప్పాయి, వివిధ రకాల నిల్వ పచ్చళ్ళ శాస్త్రీయంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఏపి కమ్యూనిటీ మేనేజెడ్ నేచురల్ ఫార్మింగ్ సంస్థ ప్రోత్సాహంతో శిక్షణ పొందిన ప్రమోటర్లు వారానికి ఒక చోట స్టాల్ పెట్టి ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. యలమంచిలి మండలంలో 11 గ్రామాల్లో సుమారు 1,218 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగవుతోందన్నారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని బోయిల కింతాడలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా టిడిపి మండల ఉపాధ్యక్షులు కొమర బాబూరావు ఆహ్వానం మేరకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరై మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బండారును కొమర బాబూరావు, స్థానిక టిడిపి, జనసేన నాయకులు ఘనంగా సత్కరించారు.

మండలంలోని గరిసింగి గ్రామంలో పరదేశిమాంబ అమ్మవారి తీర్థం, కెయం.పాలెం పంచాయితీ యండపల్లిపాలెంలో అచ్చియమ్మ, సన్యాసమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, రైవాడ జలాశయం ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రునాయుడు, పాచిల కృష్ణ, కొమర గణేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కింతాడ గ్రామం ఇలవేల్పు శ్రీరావాలమ్మ తీర్థ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయం కె.కోటపాడులో ఉండడంతో కింతాడతో పాటు కె.కోటపాడు, దాని చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఉదయం నుంచి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీసుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు. ఇతర నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నము పలు సాంస్కృతి కార్యక్రమాలు, రాత్రికి డాన్స్ బేబీ డాన్స్ ఏర్పాటు చేశారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విద్యుత్ అలంకరణ ఆకర్షించింది. రంగులు రాట్నం చిన్నారులను అలరించింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చి తిలకించారు. కశింకోట సిఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖకు చెందిన డాన్స్ టీమ్ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నేడు కొత్తపెంటలో..

దేవరాపల్లి : మండలంలోని కొత్తపేట గ్రామంలో మంగళవారం శ్రీ పైడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమా) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎడ్ల పరుగు ప్రదర్శన ఉందని, విజేతలకు భారీ నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

25న గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్రకే ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈనెల 25 శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు తెలిపారు. శ్రీ గౌరీ పరమేశ్వరి కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22న ఆలయం వద్ద గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు భారీ సారె ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. ఈ ఏడాది సుమారు 37 భారీ స్టేజ్ ప్రోగ్రాములు, 10 రకాల నేల వేషాలు, కలకత్తా వారిచే భారీ విద్యుత్ అలంకరణ, భారీ బాణ సంచా హంగామా, మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొణతాల మురళీకృష్ణ, ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కన్వీనర్ పీవీ రమణ, కొణతాల వెంకట వరప్రసాద్, టీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పైపులైనుకు రంధ్రం

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో పట్టణంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఎర్రవరం సంపు నుండి ధర్మవరం, రామచంద్రమ్మ కొండమీద గల ట్యాంకులకు నీటిని పంపేచే ప్రధాన పైప్‌లైన్ భావనఋషి గుడి ప్రాంతంలో సోమవారం మరమ్మతులకు గురైంది. అదే పైపు లైనుకు నడిగట్ల స్వీటు షాపు సమీపంలో రంధ్రం పడింది. వీటికి మరమ్మతులు చేసి మంగళవారం యథావిధిగా మంచినీటిని సరఫరా చేస్తామని ఏఈ సుబ్బారావు తెలిపారు. సోమవారం కుళాయిలు నుండి నీటి సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసినట్లు చెప్పారు.

ఆల్వార్ దాస్ వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి అల్వార్ దాస్ 22వ వర్ధంతి సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి శ్రీవెంకటేశ్వర నర్సింగ్ హోంలో అల్వార్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ డిడి నాయుడు, నల్లాల దేముడు మాట్లాడారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రాపేటి నారాయణ రావు, డాక్టర్ కె.వీరభద్రరావు, డాక్టర్ ఆడారి శ్రీనివాస్, మలేషియా వాసి కాండ్రేగుల అప్పారావు, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల గంగరాజు, భీశెట్టి రామకృష్ణ, ఆడారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఖోఖో వరల్డ్ కప్ రిఫరీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఢిల్లీలో ఈనెల 13 నుండి 19 తేదీ వరకు జరిగిన మొట్టమొదటి ఖోఖో వరల్డ్ కప్ పోటీల్లో రిఫరీగా సీహెచ్ఎల్ఎం శ్రీనివాసరావు వ్యవహరించి తమ స్వగ్రామం అనకాపల్లి మండలం తుమ్మపాలకు వచ్చిన నేపథ్యంలో సోమవారం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను గత 44 సంవత్సరాలుగా ఖోఖో గేమ్‌లో ఉన్నానని, 18 నేషనల్ ఖోఖో టోర్నమెంట్ పోటీల్లో క్రీడాకారునిగానూ, 24 సంవత్సరాలుగా జాతీయ అంతర్జాతీయ ఖోఖో టోర్నమెంట్ రిఫరీగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు ప్రారంభం



బుచ్చయ్యపేటలో పరీక్షిస్తున్న ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉచిత పశుఆరోగ్య శిబిరాల్లో భాగంగా మండలంలోని పిసినికాడ గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 65 పశువులకు, దూడ పెయ్యలకు నట్టల నివారణ మందులు వేశారు. 15 పశువులకు గర్భకోశ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అనకాపల్లి పశు వైద్యశాల డాక్టర్ అనిల్ కుమార్, సిబ్బంది కుమారి, కిరణ్, సంతోష్, కావ్య, రాము పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని వెదురుపర్తి రైతు సేవా కేంద్రం వద్ద పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్స జార్జ్ పశు ఆరోగ్య శిబిరం సోమవారం నిర్వహించారు. 30 పశువులకు గర్భకోస తనిఖీలు చేశారు. 34 పశువులు, 50 పెయ్యలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ శిబిరాన్ని ప్రాంతీయ పశు వైద్య సహాయకులు బి.సౌజన్య సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ శనివాడ అరుణ, వైస్ ప్రెసిడెంట్ అల్లవరపు కొండయ్య, ఎంపిటిసి కొత్తెం రాము, కూటమి నాయకులు కుకల వెంకటరమణ, పందాల ఎల్లయ్య నాయుడు, సగరపు సన్యాసినాయుడు, కాండ్రేగుల వెంకటరమణ, మదిని రాజా నాయుడు, కంఠంరెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులను అవలంభించడం ద్వారా పశు సంపదను సంరక్షించుకోవచ్చని బుచ్చయ్యపేట పశు వైద్యాధికారి వై.ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని కందిపూడిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు 37 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. 49 పశువులు, 20 పెయ్యలకు, 47 మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. 12 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పాక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం, తిమిరాం గ్రామాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సర్పంచులు ఆదిరెడ్డి వరలక్ష్మి, రెడ్డి సూర్యనారాయణ, ఎంపిటిసి పంచాడ సింహాచలం నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో కె.కోటపాడు ఏడి ఈ.దినేష్ కుమార్, స్థానిక పశువైద్యాధికారిణి కెహెచ్‌పి.మంజుషారాణి, మామిడిపల్లి పశువైద్యాధికారి ప్రియాంక, ఆదిరెడ్డి అక్కుతాత, బండారు శ్రీరామ్మూర్తి, రాయపురెడ్డి ఈశ్వరరావు, ఎలిశెట్టి వరాలు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.ఉషాకుమారి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అనారోగ్యంతో ఉన్న 20 పశువులకు వైద్యం అందించారు. 20 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 11 పశువులకు చూడి తనిఖీలు చేశారు 36 దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు జి.అరుణ, ఎస్.స్వర్ణలత, బి.సంధ్య, శివ, సహాయకులు కె.వెంకటరావు, అప్పలరాజు, జి.కిషోర్, మాజీ వైస్ సర్పంచ్ బొకం శ్రీరామ్మూర్తి, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ సత్తిబాబు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని పెద ముషిడివాడలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 390 పశువులకు నట్టలు నివారణకు మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పరవాడ పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ కీర్తి, పశువైద్యులు కార్టర్ సురేష్ కుమార్, అశ్విని ప్రపుల్లా, రవికుమార్, జగన్, సహాయకులు బాలాజీ, భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు.

పరవాడ : ఈ నెల 20 నుండియ 31వ వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగు పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్‌బాబు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ పరవాడ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి, పశు వైద్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి:పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య శాఖ ఏడి డాక్టర్ వీర్రాజు సూచించారు. మండలంలోని దేవవరం, జానకయ్యపేట గ్రామాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి, పశువులను పరీక్షించి మందులను అందజేశారు. పశువులకు, మేకలు, గొర్రెల కు నట్టల నివారణకు టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సను గ్రామాల్లో తమ సిబ్బంది ద్వారా వైద్య సేవలు అందిస్తామన్నారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :మండలంలో నగరం గ్రామంలో నర్సీపట్నం పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ రాజుమల్లు హాజరయ్యారు. సుమారు 100 పశువులకు వైద్యం అందించారు. 36 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు అందించారు. రైతులకు ఖనిజ లవణ మిశ్రమ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పుష్ప, గోపాలమిత్ర నాయుడు, రాము, పశు సహాయకులు కన్నబాబు, కిరణ్ పాల్గొన్నారు.

మాడుగుల:మండలంలోని పోతనపూడి అగ్రహారం, డి.సురవరం గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మణి లక్ష్మణ్, అరుణా కిరణ్, సర్పంచులు కోరుకొండ సాంభ మూర్తి, కొట్ని జయమ్మ (సన్యాసి నాయుడు) ఎం.పి.టి.సి శ్రీనాధు అప్పారావు,



ములగాడలో మందులు వేయిస్తున్న కార్పొరేటర్



గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

వైస్ సర్పంచ్ అప్పలనాయుడు, పశు వైద్య సహాయకులు నాని బాబు, కన్నం నాయుడు, మోదు నాయుడు, చంద్ర రావు, కృష్ణా రావు, గోపాలమిత్రలు జగ్గారావు, రాము, త్రినాధ్ పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గొలుగొండ పశువైద్యాధికారి లోకుల రమేష్ ఆధ్వర్యంలో 65 పశువులకు వైద్యం అందించారు. చీడిగుమ్మల గ్రామంలో పశుఆరోగ్యశిబిరం నిర్వహించారు. అనారోగ్య పశువులకు పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి, ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, నర్సీపట్నం ప్రాంతీయ పశువైద్య శాల సహాయ సంచాలకులు రాంబాబు, కృష్ణదేవిపేట పశువైద్యాధికారి శిరీష పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం ఆర్.తాళ్లవలస ప్రభుత్వ పశువైద్యశాలలో ఉచిత పశుఆరోగ్య శిబిరం ప్రారంభమైంది. పశు వైద్య చికిత్సలు, గర్భ కోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎస్‌జి.ప్రశాంతి అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు. పాడి రైతులకు, మహిళలకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు.

ఆనందపురం : మండలంలోని పాలవలస గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి అనిల్ కుమార్, సిబ్బంది కలిసి పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తమ్మిన అప్పలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుసులవాడ గ్రామంలో పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి ప్రారంభించారు. పశు పోషణ, పశువుల్లో వచ్చే జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శొంఠ్యాం పశు వైద్యాధికారి ఎల్.కన్నయ్యనాయుడు వివరించారు. అనంతరం పశువులకు నట్టల నివారణ, గర్భదారణ టీకాలు వేశారు. ఈ శిబిరంలో 65 పశువులకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో కుసులువాడ ఎహెచ్ ఎ.మోహన్‌సాయి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో పశు వైద్యాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యాన పశు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశువులకు డాక్టర్ సునీల్‌కుమార్ పరీక్షలు జరిపి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, సింయాద్రి రమణ, తిరమరెడ్డి అప్పారావు, గంట అబ్బినాయుడు, బొందల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు చేస్తున్న కార్మికులు

వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో గత కొన్ని రోజులుగా గ్రానైట్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.సుమారు గా 30 లక్షల వ్యయంతో టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆలయ గర్భగుడి చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసే నాలుగు దిక్కులూ గ్రానైట్ పలకలను అమర్చుతున్నారు. ఆలయ ప్రాకారం (బేడామండపం కింద) చుట్టూ గ్రానైట్ పనులు పూర్తయ్యాయి. గతంలో ఆలయ గర్భగుడి చుట్టూ దాతల సహకారంతో టైల్స్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటిని తొలగించి, వాటి స్థానంలో గ్రానైట్ పనులు చేపడుతున్నారు.

బొడ్డేటి నాయుడుకు నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఇటీవల తిరుమల ఘటనలో బొడ్డేటి నాయుడు మరణించిన విషయం తెలిసిందే. నర్సీపట్నం మున్సిపాలిటీ పెద బొడ్డేపల్లిలో నాయుడు స్వగృహంలో సోమవారం పెద్దకర్మ కార్యక్రమానికి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డ్ కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, రెడ్డి అప్పలనాయుడు, లాలం మురళీకృష్ణ, దశరథ్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న విజయ్

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మాడుగుల:అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా మాడుగుల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వర్తకులు శ్రీనాధు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. చోడవరం సాయి దేవి ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేశారు. మాడుగులకు సంబం ధించి జిల్లా జాయింట్ సెక్రెటరీతో పాటు మండల కమిటీ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.



నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న శ్రీనాథు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అనంతగిరి మండలంలోని గుమ్మ పంచాయితీలో గుమ్మ నుండి నిమ్మఊట, మల్లెల్లు, మిర్తిదుంగడ, కాకివలస ,మద్దిగరు, కరకవలస, కరివేసు బీటీ రింగ్ రోడ్డు నిర్మాణానికి సోమవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అనంతగిరి ఎంపిపి శెట్టి నీలవేణి, జడ్పిటిసి దీసరి గంగరాజు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, నిరంతర ప్రజల పోరాటాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో 11 కోట్లా 55 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. రోడ్డు నాణ్యతగా నిర్మాణ పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుమ్మ సర్పంచ్ కెబి రాములమ్మ, వాలాసి సర్పంచ్ సన్యాసిరావు, వైసిపి నాయకులు రేగబోయిన స్వామి, శెట్టి.లక్ష్మనరావు, కృష్ణమూర్తి, కెబి గంగరాజు, సిపిఎం నాయకులు వంతల బుద్రయ్య, కందుల పూర్ణనందు పాల్గొన్నారు.

ఆలయానికి పావు కిలో వెండి వితరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి మాడుగుల గ్రామానికి చెందిన పెయ్యిల ఎరయ్య జ్ఞాపకార్థం సతీమణి కొండమ్మ కుమార్తె సర్పంచ్ యడ్ల కళావతి, వేంకటేశ్వర్లు దంపతులు పావుకిలో వెండిని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనాదు శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, ముమ్మిన రమణ బాబు, గెంజి రాజేష్ కుమార్, జొన్నపిల్లి నాగరాజు, మజ్జి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉప కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బదిలీ పై జిల్లాకు వచ్చిన వి.ఎస్. లోకేశ్వరరావు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసారు. గతంలో ప్రకాశం జిల్లా ఒంగోలులో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిగా పని చేసిన లోకేస్వరరావు ఇటీవల జరిగిన బదిలీలలో జిల్లాకు బదిలీ అయ్యాయి. ప్రస్తుతం విశాఖపట్నంలో జరుగుతున్న జోనల్ స్థాయి విద్యాశాఖ సమావేశం, పాఠశాల విద్య బలోపేతంపై జరుగుతున్న వర్క్ షాప్ కు హాజరైన ఆయన కలెక్టర్ ను కలిసి పూల మొక్కను అందజేశారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్ల నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:విశాఖ జిల్లా పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న (నాన్ సాంక్షన్డ్) 46 మంది గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లకు బకాయి ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రమేష్, కార్యదర్శి ఆర్ మహదేవ్ మాట్లాడుతూ, గత ఏడాది మార్చి, జూన్, జూలై, నవంబర్ డిసెంబర్ మాసాలకు సంబంధించిన జీతాలను నేటి వరకు చెల్లించలేదని చెప్పారు. బకాయి జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. వేతన బకాయిలు చెల్లించనందున ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్స్ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లు



లోకసభ స్పీకర్‌తో అయ్యన్న

అఖిల భారత సభాపతుల మహాసభకు అయ్యన్న హాజరు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ నెల 20, 21 తేదీలలో బీహార్ రాష్ట్రం పాట్నాలో జరుగుతున్న 85వ అఖిల భారత సభాపతుల మహాసభలో పాల్గొనడానికి వెళ్ళారు. ఈ సందర్భంలో, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా తెలంగాణ శాసనసభ స్పీకర్ గెడ్డం ప్రసాద్ కుమార్ కలిసి ఆయనకు సాధర ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ తో పాటు ఆయన సతీమణి చింతకాయల పద్మావతి హాజరుకాగా, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు , ఆయన సతీమణి, అలాగే ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ కూడా పాల్గొన్నారు.

29న సుద్దాల అశోక్ తేజకు పురస్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:తెలుగు సినిమా పాటల రచయిత, తెలుగు సాహిత్యకారుడు సుద్దాల అశోక్ తేజ కు చతుర్దశ (14వ) వేటూరి పురస్కారాన్ని అందజేయనున్నట్లు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కె.ఆర్.జె.శర్మ, పాయకరావుపేట శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ నెల 29న వేటూరి జయంతి సందర్భంగా తుని చిట్టూరి మెట్రోలో సుద్దాల అశోక్ తేజ కు చతుర్దశ పురస్కారాన్ని అందించనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల హాజరవుతున్నారన్నారు. ఇప్పటివరకు సినీ, సాహితీ రంగంలో 13 మంది ప్రముఖులకు వేటూరి సాహితీ పీఠం ద్వారా పురస్కారాలు అందచేశామని తెలియజేశారు. ఈ సాహితీ పీఠానికి శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా సినీనటుడు తనికెళ్ల భరణి, వ్యవస్థాపక అధ్యక్షులుగా చక్కా సూర్యనారాయణ, అధ్యక్షులుగా సీహెచ్.వి.కె.నరసింహారావు వ్యవహరిస్తున్నారన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మరిడిమాంబను దర్శించుకున్న బండారు

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలోని సత్యవరం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి తీర్ధ మహెూత్సవం సందర్భంగా సోమవారం మాడుగుల శాసనసభ్యులు బండారు సత్య నారాయణమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో తీర్థాలతో ఆధ్యాత్మిక వాతావరణం కలుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పుప్పాల అప్పలరాజు, గ్రామ సర్పంచ్ జె్రిపోతుల నాగమణి, రామారావు, జె్రిపోతుల సూర్యనారాయణ, ఉప సర్పంచ్ ఓమ్మలి పెంటయ్య, జాజుల అప్పలనాయుడు, ఆర్లి కొండలరావు, శనివాడ నాయుడు, పాతరపల్లి శ్రీనివాసరావు, గట్రెడ్డి కేశవరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి సహకారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:నగరంలోని ఓల్డ్ మోటార్ పార్ట్స్, స్కూటర్ స్క్రాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎస్ ఏ రెహమాన్, 35 వార్డు గాజులు వీధిలో గల విశాఖ ఓల్డ్ మోటార్ పార్ట్స్ స్కూటర్, స్క్రాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసరావు మర్యాదపూర్వక కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూనియన్ కార్యకలాపాలకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. యూనియన్ కార్యదర్శి సలాం అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసిన యూనియన్ సభ్యులు

పశు మాంసం సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై వేంపాడు టోల్గేట్ వద్ద సోమవారం అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పశు మాంసాన్ని సీజ్ చేసినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాణి గంజ్, జల్ పాల్ ఘరి ప్రాంతంలో పశుమాంసం ప్యాకెట్లను వ్యాన్ లో లోడ్ చేసి తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ కు తరలిస్తుండగా వేంపాడు టోల్గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి, సీజ్ చేసినట్లు వెల్లడించారు. సుమారుగా 40 లక్షలు విలువ ఉంటుందన్నారు.



సీజ్ చేసిన పశు మాంసం ప్యాకెట్లు

జివిఎంసి కమిషనర్ బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన పి.సంపత్‌కుమార్, 2024 జూలై 23 నుంచి విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ గా పనిచేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆయన స్థానంలో జివిఎంసి కమిషనర్‌గా ఎవరిని నియమించలేదు. అలాగే పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ కూడా బదిలీ అయ్యారు. 2015 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వి. అభిషేక్‌ను పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా బదిలీ చేశారు.



కాలువపై అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:చింతపల్లి రోడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో పంట కాలువపై అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారంటూ ఆర్డిఓ కార్యాలయంలో ఆయకట్టు రైతులు పిర్యాదు చేశారు. పంట కాలువ స్థలాన్ని ఆక్రమించి పంటకాలువకు అనుకుని అక్రమంగా ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని రావణాపల్లి జలాశయం చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, రైతులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రావణాపల్లి జలాశయం చైర్మన్ మాట్లాడుతూ,సర్వే నెంబర్ 33/40 లో రావణాపల్లి రిజర్వాయర్ నుండి నీలం పేట మీదుగా నర్సీపట్నం, బొడ్డేపల్లి, చెట్టుపల్లి గ్రామాలలో వందల ఎకరాల పంటలకు సాగు నీరు అందించే ప్రధాన కాలువను ఆనుకొని ఉన్న స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారని తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా వినలేదన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఫిర్యాదు చేస్తున్న చైర్మన్, రైతులు

నక్కపల్లిలో చోరీ

రెండు తులాల బంగారం గొలుసు, రూ.10 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో ఉపమాక వెళ్లే మార్గంలో జి.శ్రీదేవి గృహంలో దొంగలు చొరబడి బంగారం, నగదు దోచుకున్నట్లు ఎస్సై సన్నిబాబు తెలిపారు. ఈనెల 15వ తేదీన ఆమె గాజువాక వెళ్లి, 20వ తేదీ సోమవారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. రెండు తులాల బంగారం గొలుసు, పది వేల రూపాయల నగదు దొంగలు దోచుకున్నట్లు ఆమె ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సన్నిబాబు, క్లూస్ టీం పరిశీలించారు. బాధితురాలు నుండి వివరాలు సేకరించారు.



విచారణ చేపడుతున్న ఎస్ఐ